శ్రీ వేంకటేశ్వరాయనమః

# శ్రీ వేంకటరమణ శతకము

రచయిత:
ప్రతాప రాఘవపాత్రయ్య
బెజవాడ

పరిష్కర్తలు:
వెల్లపిల్ల వేంకటశాస్త్రిగారు
శతావధానులు

శ్రీ వేంకటేశ్వరాయనమః

# శ్రీ వేంకటరమణ శతకము

రచయిత:

ప్రతాప రాఘవపాకయాజి

పరిష్కర్తలు:

చెళ్లపిళ్ల వేంకటశాస్త్రిగారు

శతావధానులు

తే. పరమ భాగవతుఁడు శ్రీనివాసరాయఁ
డనఘుఁడైన కర్నూలి సదన్వయుండు
తనదు తల్లి భవానమ్మ మనసెఱింగి
అచ్చువేయుంగఁ గొంత సాయం బొనర్చె.

తే. ఓరుగంటి వేంకటరత్న మురుయశుండు
పచ్చిగోళ్ళ వంశ్యుండు సుబ్రాయగుప్త
వనమ వంశ్యుండు బ్రహ్మయ్యతనుభవుండు
కోటిరత్న సమాఖ్యుండు గురుహితుండు
మఱియుఁ గొందఱు ధర్మతత్పరులు దీని
నచ్చువేయించిరలవారి కగుత శుభము.

(షట్పది)

శ్రీ మత్పరదేవతాయై నమః

# తొలిపలుకు

ఈ వేంకటరమణ శతకము రచించిన రాఘవ పాకయాజి తిరుపతి వేంకటకవుల శిష్యుఁడ నని యిందేకాక మఱికొన్ని పద్యములలోఁగూడ వ్రాసి నాఁడు. ఈ శిష్యత్వము కేవల మేకలవ్యశిష్యత్వము. నేఁటికి సుమారు 43 సం॥రముల నాఁడు గుంటూరి సీమలోని వేమవరాగ్రహారమున జరిగిన యవధాన మునకుఁ బలువురు కవికిశోరములతోఁ బాటుగా నీతఁడును వచ్చెను. ఆ యవధాన పద్యములే కాక మా రచించినవి పెక్కు లీతనికిఁ గంఠపాఠము. ఈయన గురుభక్తియు, దైవభక్తియుఁ గనుంగొను వర్ణనీయములు. ఈయన ప్రవర్తనవంటి ప్రవర్తనకల బ్రాహ్మణులను వింటిని గాని చూడలేదు. యాదృచ్ఛికముగా నీశతకము నందు దొరలిన పద్యమొకటి యీాయన సదుద్దేశములను వ్యక్తీకరించును. దాని నుదాహరింతును.

క. సతతము మద్గృహమందున
యతులను భక్తులను గవుల యజ్వలను బతి
వ్రతలను గుడువఁగఁ జేయు మ
వితథపు మృష్టాన్నములను వేంకటరమణా!

ఈయనకు నేను బరిచితుఁడ నైనను నా కీయన యపరిచితుఁడు. ప్రస్తుతము నేనీ బెజవాడలోనున్న

కారణమున నీ మధ్యకాలమున నా కీయన పరిచ యము గల్గినందులకు సంతసింతును.

శ్లో॥ నహ్యమ్మయాని తీర్థాని నదేవా మృచ్ఛిలామయాః
తే పునం త్యురుకాలేన దర్శనాదేవ సాధవః॥

అను శ్రీమద్భాగవతశ్లోక మిట్టి యోగ్యుల పట్లనే సమన్వయింపఁ దగినది. ఈయన కర్మిష్ఠుఁడు. సనాతనాచార పరుఁడు. ఈయన భార్య మనుచరి త్రములోని— తే॥ గీ॥ వండ నలయదు వేవురు వచ్చి రేని" అను పద్యమునకు నుదాహరణమైన మహా సాధ్వి. నా కీయన శిష్యుఁడనని వ్రాసికొన్నప్పు డీయనంగూర్చి నేను విస్తరించి వ్రాయుట పాడి గాకున్నను నాకుఁ గల్గిన యానందము నించుక వ్రాయక తప్పినది కాదు. ఈయననుగూర్చి నా సౌభాగ్యకామేశ్వరీ స్తవములో ని ట్లుదాహ రించితిని. ఆ పద్యములు చూపి దీనిని ముగింతును.

మ. అతిచిత్రంబు ప్రతాప రాఘవకవి
వ్యాపార, మాతం డెటుల్
సతముం సాఁకెడి భక్ష్య భోజ్యములతో
సత్రమ్ముగా నిల్లు తా
నతిథుల్ రాఁగ నటే బుభుక్షకొఱకై
యభ్యాగతుల్ రాఁగఁ, ద
త్కృతి కాశ్చర్యము పుట్టు, రిత్తుఁ దతఁ డో
దేవేశి కామేశ్వరీ! ౩౪౫

మ. కలదే? కామగవీమతల్లి యతనిం
గాపాడ(, జింతామణుల్
గలవే? యాతనియింట(, గల్పకములుఁ
గన్పెట్టునే యాతనిఁ,
గలదే? యాతని కగ్రహార, మెఱు(గుం
గా! నీదు చిత్తంబు, పు
ష్కల మహ్మాఱుని యన్నదాన మిది నీ
సాయంబు కామేశ్వరీ! ౩౪౮

ఈ విజయవాడలో నెవ్వరుగాని యీాయన యన్నదానముం గూర్చి అన్యథా వచింపరు. నేను పదచలనము చేయమింజేసి యాయన యెన్నిసార్లు కోరినను నిప్పటికి నేగి చూడలేదు. కాని పలువుర వలన వింటిని. ఆముక్తమాల్యదలోని

శా. ఆ నిష్ఠానిధి గేహసీమ నడురే
యాలించినఁ మ్రోయు నెం
తే నాగేంద్రశయాను పుణ్య కథలుఁ
దివ్యప్రబంధానుసం
ధానధ్వానము "నాఽస్తి శాకబహుతా
నాస్త్యుష్ణతా నాస్త్యపూ
పో నాస్త్యోదనసౌష్ఠవంచ కృపయా
భోక్తవ్య"మఁ పల్కులుఁ.

అను పద్యమును జ్ఞప్తికిఁ దెచ్చు నీ బ్రాహ్మణోత్తముని యాతిథేయత్వము నభినందించుటయుఁ గొండొక ధన్యత్వసంపాదకమని యీ నాల్గు మాటలును వ్రాసితిని. కారణము చెప్పఁజాలను గాని మన రాజధానిలో నేపట్టణమందుఁ గాని యే పల్లెయందుఁగాని యీ బెజవాడలో నున్నంతమంది పుణ్యపురుషులు చిక్కరు. ఇందలి ధనికు లొనర్చు దీనజనావనము ప్రత్యేకించి పేర్కొనఁదగినది. ఎందఱికో యీ దుర్గాక్షేత్రము జీవనమును కల్పించుచున్నట్లు కనిపెట్టితిని. సతతము గీతా భాష్యాదిశ్రవణము పురాణశ్రవణము వేదశాస్త్రజ్ఞసన్మానము లోనగు పుణ్యకార్యములు తరపరంపరగా నిందు జరుగుచుండును. లోకమంతెల్ల డలఁ గలి ప్రవేశించినను నిచ్చోట నింకను బ్రవేశింపలేదని నే ననుకొనుచుందును. దీనిని విస్తరించుటకిటఁదావు చాలదు. ఈ శతకకర్త ధన్యుఁడు, భక్తుఁడు, అన్నప్రదాత. ఈయనకు శ్రీ దుర్గాపరమేశ్వరి తోడ్పడుఁగాక! చిరాయురారోగ్య భాగ్యములొసంగి పూనిన పూనికను నెఱవేర్చి యశమందుఁ గాక!

వెం॥ శా॥ శతావధాని, బెజవాడ.

శ్రీః

శుభమస్తు, అవిఘ్నమస్తు,

శ్రీ వేంకటేశాయ నమః.

శ్రీరామజయము

# శ్రీ వేంకటరమణ శతకము

క. శ్రీయుత! యలమేల్మంగా
ఖ్యాయుత! కళ్యాణదాయకా! దేనికి నీ
సాయమె శతకమ్మునకున్
వేయిగతుల నాకు దిక్కు వేంకటరమణా! ౧

క. ఎక్కుడు చదువుల నెఱుఁగను
తిక్కనకవితన్ బఠించి తీరుగ నెట్లో
కొక్కిరిబిక్కిరి గూర్చితి
వెక్కిరిసించెదరు కవులు వేంకటరమణా! ౨

క. కరితో దోమయు సల భా
స్కరుతో మిణ్గురుపురుగును గడలికిఁ గోలన్
సరిగాని యట్లు నీకున్
బెఱవేల్పులు సరియుఁ గారు వేంకటరమణా! ౩

క. కొందఱు స్కందుం డనియును
గొందఱు శివుఁడనుచుఁ దలఁచికొందురు; మఱియున్
గొందఱు భక్తులు నిను గో
విందుం డని తలఁచుచుందురి వేంకటరమణా! ౪

క. సేవింతురు నిను స్మార్తులు
సేవింతురు వైష్ణవులు నినీ! శైవు లహో!
సేవింప సంశయింతురు
వేవిధములఁ జెపుదు మేని వేంకటరమణా! ౫

క. రక్షకుఁడవయ్యు జగతిని
రక్షించుచునుండి పెద్దరాజవగుచు నీ
వక్షమత వడ్డికాసుల
భిక్షకుఁ బొల్పడఁగ నేల? వేంకటరమణా! ౬

క. వేదమ్ములు దొంగిలి యీఁ
గాదని శఠియించు సోమకాసురు శిరమున్
ఛేదింప మీన మైతివి
వేదాంతశిరోవిభూష! వేంకటరమణా! ౭

క. కూర్మావతారమందున
నిర్మలమతి వీఁపుపైన నేర్పునఁ గొండన్
ధర్మస్వరూప! మొత్తవె?
పేర్మిని దేవతలఁ గావ వేంకటరమణా! ౮

క. పుడమిని జాపగఁ జుట్టియుఁ
గడలిని దా నుండ హేమకశిపునను జునిన్
మడియింపవె! సూకరమై
విడనాడక జగతిఁ బ్రోవ వేంకటరమణా! ౯

క. నరహరివై ప్రహ్లాదునిఁ
గరుణించితి వంత హేమకశిపు నసువులన్
హరియించి యెల్ల జగముల
వెలయింపవె రౌద్రమూర్తి! వేంకటరమణా! ౧౦

క. వడుగవునై పుడమిని మూఁ
డడుగులు యాచించి ధరణి యాకాశము రెం
డడుగుల సరిపడ బలి నీ
పెడయుఁగునఁ ద్రొక్క లేదె? వేంకటరమణా! ౧౧

క. శ్రీ పరశురాముఁడవు నయి
భూపతులబలమ్ముఁ దేజమును గొని కోపో
ద్దీపితుఁడ వగుచు నీ పృథి
వీపాలన సేయలేదె? వేంకటరమణా! ౧౨

క. దశరథరాముఁడ వవుచున్
బశుపతివిలు ద్రుంచి సీతఁ బరిణయమై యా
దశముఖుశిరములు ద్రుంపవె
విశృంఖల మహా స్సహాయ! వేంకటరమణా! ౧౩

క. బలరామమూర్తి వగుచును
హలమును జేఁబూని హస్తినాఖ్యపురమ్మున్
బలిమి నదిఁ ద్రోయ నెంచవె
విలసద్భుజబలవిహార! వేంకటరమణా! ౧౪

క. ఆచారంబని కొందఱు
నాచారం బనుట యొప్పదని బుద్ధుఁడవై
యేచి జగన్నాథములోఁ
బేచీల నణంచి తీవు వేంకటరమణా! ౧౫

క. లలిఁ గల్కివగుచు నలశం
బళ మనుగ్రామమున మంచి బ్రాహ్మణ్యుండౌ
నలవిష్ణుశర్మ యింటను
వెలయంగాఁ దలఁతు వంట! వేంకటరమణా! ౧౬

క. పట్టంగలేరు వ్రతములఁ
బట్టంగాఁలేరు నిన్ను బహుక్రతువులచేఁ
బట్టెదరు భక్తి సత్రాల్
పెట్టియుఁ బట్టంగలేరు వేంకటరమణా! ౧౭

క. సతతము మద్గృహమందున
యతులను భక్తులను గవ్వల యజ్వాలను బతి
వ్రతలను గుడువఁగ జేయు మ
వితథపుమృష్టాన్నములను వేంకటరమణా! ౧౮

క. రక్షింపదు శాంతత్వము
రక్షింపదు నిఖిలభూతరక్షాకృతియుఁగ
రక్షించు భక్తి యొకటే
వీక్షించితి గ్రంథములను వేంకటరమణా! ౧౯

క. అకళంకు నిన్నుఁ జేరుగఁ
బ్రకటించు ప్రసేనునన్నఁ బరిభవమున్ జొ
న్పక యతనికూఁతు సత్యను
వికచాంబుజనేత్రిఁ గొనవె? వేంకటరమణా! ౨౦

క. నీ మహిమ గాంచువారల
నీ మహిలోఁ గాంచఁజాల నెచట వెదకి నే
నామెయి నజు పంచింపవె
వేమఱు నిను సన్నుతింతు వేంకటరమణా! ౨౧

క. తెలిసితి నీ చరితంబులఁ
గొలుచుచు నిను యోగినగుచుఁ గొండలరాయా!
నిలిచెద నీ కృపగల్గిన
విలసిల్లుచు నూఱునేండ్లు వేంకటరమణా! ౨౨

క. తనువే నిలుపు మటులు కా
దనుచో నీకఁ బుట్టకుండునట్టు లొసఁగుమీ
వినుతు లొనర్తును సతతము
వినుమిది పెడచెవినిగాక వేంకటరమణా! ౨౩

క. విదురునిపై నరుపైనను
గుదురుగ నక్రూరుపైన గోపికలపయిన్
వెదఁజల్లు నీదుకృప నో
ప్పిదముగ నామీఁదఁ జూపు వేంకటరమణా!

క. ఒంటరిగా వ్రజబాలిక
యింట న్నిదురించుచుండ నేగియు నా వా
ల్గంటిని-జీరితి వఁట! నే
వింటిని నీభాగవతము వేంకటరమణా! ౨౫

క. అన్నియుఁ దీర్థంబులు నీ
సన్నిధిలోఁ గలవు ముక్తిసంపత్తికినై
యెన్నియొ తావులు గొందఱు
పిన్నలవలెఁదిరుగుటేల వేంకటరమణా! ౨౬

క. మెట్టున రోటిని బెట్టిన
నట్టి యపుడు నందకున్న నొకపీఁట నటన్
బెట్టి పనంటికిఁ దూటన్
బెట్టవె? పాల్ద్రావుకొఱకు, వేంకటరమణా! ౨౭

క. కడవలలోఁ బాల్పెరుగును
బుడుతలకును బడుచులకును బోసి కడవలన్
దడబిడఁ బగులఁగఁ గొట్టియుఁ
బెడదారిని జనితివంట! వేంకటరమణా! ౨౮

క. ఒకభార్యయు రుక్మిణి యిం
కొకభార్యయు సత్యభామ యొకరిద్దఱె నీ
కకళంకలు గల రెందఱొ
వికచాబ్జాక్షు లని విందు వేంకటరమణా! ౨౯

క. తిరిగితివి వెఱపు లేకయె
మఱుగేమియు లేక వాండ్రి మగ లుండఁగనే
సరిపడని పనులు చేసితి
వెటిగొల్ల లయిండ్ల నీవు వేంకటరమణా! 30

క. పండరిపురవరమున నీ
వుండియు బహుభక్తజనుల నోగి నేలుచు బల్
దండన పడు చకుబాయికిఁ
బిండిని విసరంగ లేదె? వేంకటరమణా! 3౧

క. వసుదేవునికొమరుఁడనై
పసితనమున మద్దిచెట్లఁ బడఁద్రోసి స్త్రీమాలీ
మసఁ బూతన న్వధింపవె
విసమును రక్తమును గ్రోలి వేంకటరమణా! 3౨

క. వాసిగల కపిలతీర్థము
వాసుకితీర్థమును శ్రీనివాసునికొలనుఁ
భాసిలుచుండఁగ నీకడ
వేసరి కాశిఁ జననేల? వేంకటరమణా! 33

క. ఉండవు వైకుంఠములో
నుండవు తిరుమలను నిలిచి యుండవు రవిలో
నుండెదవు భక్తిరసముఁ
బిండెడి సద్భక్తులిండ్ల వేంకటరమణా! 3౪

క. వసనము లిత్తు యమునలో
వెనఁ గుసితోఁ చేతులెత్తి వినయము మెఱయన్
పసిఁజక్క మ్రొక్కుఁడంచును
బిసబాహులతోడ ననవె? వేంకటరమణా! ౩౫

క. దేవతలలో గరిష్ఠుఁడ
ఏవిధమునఁ గొంటెపనుల నెటు చేసెదవో
కోవిదులు నగుదురంచును
వేవిధముల వ్రేఁత లనరె? వేంకటరమణా! ౩౬

క. భరమగు కోపమ్మున సుం
దరి ద్రౌపదిచీర లొలువఁ దత్సభలో నీ
వరి దుశ్శాసనుకృత్యము
నెరవరివై యడఁపలేదె? వేంకటరమణా! ౩౭

క. ఆడితి గోపాలురతోఁ
బాడితి వా వేణుగీతి భామలసిగ్గుల్
వీడఁగఁ జేసితి చెలువలు
వేడఁగ వసనముల నీక వేంకటరమణా! ౩౮

క. క్రూరాత్ముఁడేని నీ యసి
ధారఁ బడినవాఁ డొనర్చు పాపము లడఁగున్
జేరఁడె? కంసుఁడు దుష్టుఁడు
వీరస్వర్గమున కెలమి వేంకటరమణా! ౩౯

క. భాగవతచరిత్రంబులు
బాగని మదిలోఁ దలంచి బహురీతుల ను
ద్యోగములు దొలఁగుకొఱకై
వేగతుల రచించుచుంటి వేంకటరమణా! ౨౦

క. కుఱ్ఱఁడవై కుఱ్ఱలతో
దొఱ్ఱులఁ గాచెద నటంచు దుర్భగులు శ్రుతిన్
జుఱ్ఱరు నీనామసుధను
వెఱ్ఱులుగారొక్కొ? వారు వేంకటరమణా! ౨౧

క. మన్నేల తింటివిర? మా
యన్నా! యని తల్లి యనఁగ నఖిలజగంబుల్
"తిన్నానా"? యని నోటన్
విన్నాణివి చూపితంట? వేంకటరమణా! ౨౨

క. అచ్చపుఁజీఁకటిలోఁ బడి
విచ్చలవిడి గృహమునంటి విషయము లను న
య్యుచ్చులఁ బడి చచ్చెడియా
పిచ్చి యముం దాఁటఁగలఁడె? వేంకటరమణా! ౨౩

క. అజరుద్రాదుల నైనన్
గజిబిజిఁ జేసితివి నీవు కంసాంతక! నిన్
భజియింపనైతి నన్నున్
విజయసఖా! కాచుటెట్లు? వేంకటరమణా! ౨౪

క. కూరిమి బాపఁడ నగుచున్
ధీరత గోర్కె లిడి ధరణిదేవుఁడ నగుచున్
గోరి భుజింతును విప్రుని
వేఱుగఁ దలఁపఁదగ దనవె? వేంకటరమణా! ౪౫

క. ఏటికి నీ సంసారము
దాఁటఁగఁ జాలఁగద? నేను దరిఁజేర్పుము నీ
బోటి మహాత్ముల నే నే
పీటను జూడంగఁ బోను వేంకటరమణా! ౪౬

క. ఆగ్రహము గలిగి యుండె న
వగ్రహములలోనఁ గొన్ని వానిదశల మం
దగ్రహము నడచుచుండె సు
విగ్రహ! నీవుండ భయమె? వేంకటరమణా! ౪౭

క. పల్కుకుఁ బల్కుకు నమృతముఁ
జిల్కఁగ సిరి కల్కిమిన్న సేవింపఁగదున్
గుల్కెడు రెండవ చెఱకున్
విల్కాఁడవు నీవు గావె? వేంకటరమణా! ౪౮

క. చండతరంబగు రాక్షస
మండలమును భండనమున మార్కొని మఱి కో
దండమునన్ బడఁద్రోయవె?
బెదువదన్ జేసి నీవు వేంకటరమణా! ౪౯

క. నీలా! ఘనలీలా! మృదు
శీలా! శ్రీనందబాల! శ్రితజనపాలా!
నీలావణ్యం బెంచఁగ
వీలా! యెవ్వరికినైన వేంకటరమణా! ౫౦

క. చేయించి తెన్నొ యాత్రలు
వ్రాయించితి విపుడు నీదుపైని శతకమ్ముఁ
చేయూఁపఁదలఁచి వేలిమి
వేయింపవె? సక్రమముగ వేంకటరమణా! ౫౧

క. ముగ్గనొ? లేదో? యని కని
యెగ్గనకే శబరి యొసఁగ నెంగిలిఫలముల్
దగ్గఱబాంధవ్యంబా?
బెగ్గలపడి తింటి వపుడు వేంకటరమణా! ౫౨

క. ఇప్పుడు కవిత్వమును నేఁ
జెప్పఁగ నుత్సాహపడియు జేజే యని నీ
కొప్పఁగఁజెప్పితి మెమ్మె
పెప్పే యనఁజేయకయ్య! వేంకటరమణా! ౫౩

క. నారాయణ! శ్రీజగదా
ధారా! శ్రీ చిత్తచోర! ధరధర! మారా
కారా! మమ్మేలుము గం
భీరా! కల్మషవిదూర! వేంకటరమణా! ౫౪

క. శ్రీశా! యిపు డెపుడు నీ
దాసులదాసులకు దాసదాసులతో సా
వాస మొసఁగి సుకవి సమా
వేశము ఘటియింపుమయ్య! వేంకటరమణా! ౫౫

క. కృష్ణా! యిహసుఖ మను మృగ
తృష్ణకు నే లోనుగాక తేఁకువమై భ్రా
జిష్ణున్ జిష్ణున్ సాత్వా
ద్విష్ణు న్నినుఁ గొలుచువాఁడ వేంకటరమణా!

క. ఎందఱు తరియించిరి యే
సందియమున్ లేక నిన్ను స్మరియించి తుదిన్
పొందఁడె? వైకుంఠము గో
విందా! ఖట్వాంగవిభుఁడు వేంకటరమణా! ౫౭

క. పాలింపుము మమ్మెప్పుడు
దేలింపు భవాబ్ధినుండి దీనుఁడ నో గో
పాలుఁడ! పరమదయాళుఁడ!
పేలవముగఁ జూడఁబోకు వేంకటరమణా! ౫౮

క. ఎత్తితివి పెద్దకొండను
మొత్తితి వానాఁడు పోఁకుమూఁకల నలమే
సత్తను హత్తి రహించితి
వేత్త లెఱుఁగువారు నిన్ను వేంకటరమణా! ౫౯

క. రాముఁడవు నీవె, అలబల
రాముఁడవును నీవె, పరశురాముఁడ వీవే
సోముఁడవు నీవె, యారణ
భీముఁడవును నీవె, తలఁప వేంకటరమణా! ౬౦

క. తిరుమలలో రాజ్యము శే
షగిరిఁ జందనపురస మొసఁగఁ బౌనకముల్
బోరిఁబోరి మంగళగిరిఁ దా
వి రంగమున నిద్రిగొందు వేంకటరమణా! ౬౧

క. ప్రారంభించితి నీనుతి
ప్రారంభించినది మొద లపారమయిన వా
గ్ధార యుదయించె నాకున్
హీటేఁడి నన్నేలుఁగవా కొ! వేంకటరమణా! ౬౨

క. ఎన్నో దినములుగా నిన్
సన్నుతిఁ జేయుందలంతు సత్కృతితో వి
ద్వన్నుత! సమకూర్పఁగదే
వెన్నుఁడ! విఘ్నము లడంచి వేంకటరమణా! ౬౩

క. దోసము లెన్నియొ చేసియుఁ
గాసైసను విడువ కేను గడియించితి నా
యాసపడి చేయ ధర్మము
వీసమయిన ము క్తి యెటు వేంకటరమణా! ౬౪

క. కొట్టితిని ఖేరి మీకృప
నెట్టితిఁ బద్యములు కొన్ని నేర్పుగను దుదన్
ముట్టింపుము గ్రంథమ్మును
బెట్టెద దండములు నీకు వేంకటరమణా! ౬౫

క. మత్తత నీపదభక్తిన్
జిత్తము హత్తించి సేవఁ జేయనయితి వి
ద్వత్త గలవాఁడనా? దు
ర్వృత్తుఁడ ననుఁ బ్రోవుమయ్య! వేంకటరమణా!

క. కలవార లెంద ఱిక్కలిఁ
గలుములు లేనట్టివారు గల రెందఱు భూ
స్థలిఁ గలిమి నిక్కమగునే!
విలపింతురు ధనము కొఱకు వేంకటరమణా! ౬౭

క. అంతయు మిథ్యయె తలఁపఁగ
నెంతురు నిక్కమని యెంద ఱెందఱో మదిలో
సంతస మొందుచు నుండుట
వింతగ నున్నదిగదయ్య! వేంకటరమణా! ౬౮

క. చాల దినమ్ములకిందట
మేలొనరింపం దలంచి మేకొని యెన్నో
లీలలు చూపియుఁ దత్త్వము
వీలుగ బోధింపలేదె! వేంకటరమణా! ౬౯

కం. నిరుపమగతి గల్గును నీ
దరిఁజేరిన భాగవతుల దర్శించుటచేఁ
గరుణానిధి జగదీశ్వర!
బిరబిర ననుఁ గావరావె? వేంకటరమణా! ౨౦

కం. నినుఁ దల్లి దైవములోఁగనెఁ
బనిచెన్ మఱి మాఱుదల్లి పాలన్ ద్రాగివన్
దనుజాంతక! నీ చరితము
విన వేడుక కల్గునయ్యా వేంకటరమణా! ౨౧

కం. ఒకతల్లి కడుపునం బడి
యొకతల్లికిఁ బుట్టినట్టి యొడయం డవతఁ డ
న్నకదా! నీకున్ మిక్కిలి
వికటము నీవంశగరిమ వేంకటరమణా! ౨౨

కం. నీ వెల్లదిశల నుందువు
నీ వుండని-చోటులేదు నిగమస్తుత్యా!
నీ వందటి హృదయమ్ముల
వే విధముల నుండి ప్రోతు వేంకటరమణా. ౨౩

కం. కందములని యెడి కుసుమము
లందమ్ముగ సరముగూర్చి యందించెద నీ
సుందరకంఠమునన్ గో
విందా! ధరియింపుమయ్యా! వేంకటరమణా! ౨౪

క. తిరుపతి వేంకటకవి వర
గురులను బ్రార్థించి కవిత గూర్తు నిపుడు నో
కరుణాకర! యిఁక నాకున్
వెఱపు రవంతయును లేదు వేంకటరమణా! ౭౫

క. పరమోత్తమగురువులకున్
గురువులయిన వారలకును గురుఁడవుకద! నే
నెఱుఁగమి నడిగెద నే వా
వి! రాధకును నీకుఁ దెలుపు వేంకటరమణా! ౭౬

క. ఇంటికి బిచ్చానకు రా
నంటుకొనెన్ నీదుచెలియు లందఱి విడి నీ
వెంటఁబడి రాదె? రుక్మిణి
వింటిని మీయింటిగరిమ వేంకటరమణా! ౭౭

క. పట్టితి శంఖముఁ జక్రము
బట్టఁగ నాగలిని నన్న భాగములోనన్
బెట్టితి విది నాయమె సరి
పెట్టిన సరిపోవుటెట్లు? వేంకటరమణా! ౭౮

క. సుందరులందున్ నందను
లందున్ ఘనమందిరములయందున్ వాంఛన్
జెంది రమించుచు నిను గో
విందా! యన రేమి! సామి! వేంకటరమణా! ౭౯

క. తిరుమల వైకుంఠం బగుఁ
దిరుమల కైలాసమగును దీర్థములెల్లన్
దిరుమలయందే యున్నవి,
వెఱతీర్థము లేగనేల వేంకటరమణా! ౮౦

క. శిష్టుల రక్షించుటకై
యష్టమగర్భమున భగవదంశన్ గంసున్
దుష్టు వధించుటకై యుప
విష్టుఁడవై పుట్టినావు వేంకటరమణా! ౮౧

క. సారము లేనిది యీసం
సారము తెలియించుకొనుటకు సారెకు నిన్నున్
గోరి భజించెద నన్నున్
వేఱుగ గణియింపఁబోకు వేంకటరమణా. ౮౨

క. రాతి నడవి దాఁకియు నల
కోఁతుల గోళ్ళంటినీదు కోమలపదకం
జాతములు కందెఁగద! సం
ప్రీతిన్ బరిచర్యఁజేతు వేంకటరమణా! ౮౩

క. రాగద్వేషంబులు నే
త్యాగముఁ జేయంగఁజాలఁ దరిజేర్చి యెటో
భోగింద్రశాయి! నన్నున్
వేగమ రక్షింపుమయ్య! వేంకటరమణా! ౮౪

క. కరిలోనఁ గిరిలోనఁ
హరిలో ననలంబులోన నంబుధిలోనన్
ధరలోనఁ గల వుంటివి
వెఱిగొల్లలలోనఁగూడ వేంకటరమణా! ౮౫

క. కోరను రాజ్యసుఖంబును
గోరను నే నాకసుఖము గోరను ముక్తిన్
గోరుదు నీ కారుణ్యము
వేఱెయ్యది కోరనింక వేంకటరమణా!. ౮౬

క. ఛిద్రపు గావంచాను ద
రిద్రించు కుచేలుఁ డెలమిఁ బృథుకముల నెటో
భద్రముగ ముడిచి యిడఁగన్
విద్రుమములు మణులు నిడవె! వేంకటరమణా!

క. దండము పాండవపక్షా!
దండము కరుణాకటాక్షా! దానవశిక్షా!
దండము మునిజనరక్షా!
వెండేనుఁగు నెక్కు దక్ష! వేంకటరమణా! ౮౮

క. ఎండకుఁ గల్వలగతియై
యుండును మఱి నీదునండ నుండనిచో నీ
యండ మదిఁ గోరువారికి
వెండియుడుదు బంగరిడును వేంకటరమణా! ౮౯

క. యజ్ఞహవిస్సులు నీవే
యజ్ఞములో భోక్త నీవె! యజ్ఞం బీవే
యజ్ఞమున బ్రహ్మ నీవే
విజ్ఞనుతా! హోత నీవె వేంకటరమణా! ౬౦

క. అక్రమమనరాఁగద! రవికిన్
జక్రం బడ్డముగాఁ బెట్టి చంపించితి వే
విక్రమ మిది సైంధవునిఁ ద్రి
విక్రమ! గాండీవిచేత వేంకటరమణా! ౬౧

క. కనుమా! నన్నుఁ బ్రోవన్ మది
ననుమానము మానుమా! రమాధిప! వేడ్కన్
గొనుమా! మామానుతులన్
బెనువ్రాకులఁ గూల్చు బాల! వేంకటరమణా!

క. పరు లెయ్యది యొనరించిన
మఱివారికి అప్రియము తనదుమనమునకు నగున్
దిరిగియు నటు సేయం డది
విరసులపని యంచు జ్ఞాని వేంకటరమణా! ౬౩

క. అప్పులు చేసియు నెట్లో
తప్పుకొనన్ దలఁచి యెదియొ తప్పుడు సాక్ష్యం
బిప్పించినంతఁ గాలుఁడు
పిప్పిగఁ బీడింపకున్నె? వేంకటరమణా! ౬౪

క. ముడుపులు బంగరుకణికలు
నుడుపులుఁ గడుభక్తి నీకు నొసఁగఁగ వేడ్కన్
దొడవుల నిలువుగ బలుదో
పిడిదొంగంబోలెఁ గొందు వేంకటరమణా! ౯౫

క. శ్రీ కనకదుర్గతల్లి న
నేకవిధంబుల భజించి యీగతిఁ బుణ్య
శ్లోకు నినుఁ బొగడఁ జాలితి
వీఁకన్ గృపఁ జూడుమయ్య! వేంకటరమణా!

క. నిను గొప్పఁజేయు నొక్కం
డనఁదగదటుశివుఁడె, గొప్పయని యొక్కఁడనున్
గనుఁగొనఁజాలక తత్త్వము
పెనుతురు వాదముల నిల్లు వేంకటరమణా! ౯౭

క. ఎన్నఁడుఁ బౌరోహిత్యం
బెన్నఁడు మాఠాధిపత్య మెపుడుఁ బరాన్నం
బు న్నాకు సున్నఁజేయుము
వెన్నుఁడ! యేజన్మమునను వేంకటరమణా! ౯౮

క. పలుకరు తక్కిన వేల్పులు
పలువిధముల వేడినన్ దపంబు సలిపినన్
ఫలము లొసంగిన నీవే
పిలిచినఁ బలికెదవు దేవ! వేంకటరమణా! ౯౯

క. మంగళము లోకనాయక!
మంగళ మోశ్రీనివాస! మహీధరనిలయా!
అంగజజనకా! శ్రీతిరు
వెంగళపతి! మంగళమ్ము వేంకటరమణా! ౧౦౦

సీ. శ్రీ పరితాపకులాబ్ధి శీతాంశుఁడగు నాదు
ప్రపితామహుండు సుబ్బన వధాని
వేదాదివేత్తయౌ వేంకటశాస్త్రి యు
ద్దాముండు నాదు పితామహుండు
బహుశ్రుతబోధనుఁడగు బసవావధాని స
ద్ధర్మజ్ఞుఁ డతఁడు నా తండ్రిగారు
ధవుఁడే తనకు ముఖ్యదైవతం బనియెంచు
సాధ్వి శ్రీవరలక్ష్మి జనని నాకు
బ్రహ్మవిద్యాబోధపరుఁడు రామయశాస్త్రి
యఖిలార్థవేత్త నా యగ్రజుండు
పార్థివలింగ సపర్యా పరుండు సు
బ్బావధాని వేరొక్క యగ్రజుండు
అనఘ! రాఘవ పాకయాజి యనంబడు
వాఁడ నిన్నే వేళ వేడువాఁడ
భవదీయ కరుణకుఁ బాత్రుఁడు కొడుకు రా
ధాకృష్ణశాస్త్రి త్వద్భక్తవరుఁడు

గీ. భార్య నాకు సరస్వతి; యార్యులయిన
సరస తిరుపతి వేంకటేశ్వరులు గురులు
నీ వుపాస్యదైవతమవు నిగమవినుత!
వేంకటేశ్వర! కృతిగొమ్ము వినుతిఁ జేతు.

అయ్యంకి వేంకటరత్నము M. Sc. గారిచే
బెజవాడ ఆంధ్రగ్రంథాలయ ముద్రాక్షరశాలయందు
ముద్రింపబడినది.

శ్రీ వేంకటేశ్వరాయనమః

# శ్రీ వేంకటరమణ శతకము

రచయిత:

ప్రతాప రాఘవపాకీ

బెజవాడ

పరిష్కర్తలు:

వెల్లపిల్ల వేంకటశాస్త్రిగారు

శతావధానులు